

# అగ్నిపుష్పం

డా॥ అక్కిరాజు రమాపతిరావు

నాకేమిటో ఎప్పుడూ అసంతృప్తి వుంటుంది. అది మనస్సు స్వభావమో, లేక చేతకానితనం వలన కలిగిన ఆమాయ, తద్వారా అసంతృప్తో మరి. 'నిజంగా మాకేవీ సమస్యలు లేవు. సుఖంగా, తృప్తిగా పితుకుతున్న పాలమీది నురగ పైపైకి పొంగుతున్నట్లుగా బ్రతుకుతున్నామని ఎవరయినా అనగలరా? ఒకవేళ అన్నప్పటికీ అందులో కల్తీ లేని నిజముంటుందా! అస్సలలాటి జీవితాలుంటాయా?' అన్నదే నా సమస్య.

నేను నిరాశావాదినంటే నేనొప్పుకోను. కాని లేనిదానిని వున్నట్లు తలచుకొని— మనస్సుని, అనుభూతిని నిద్రపుచ్చి అటూ యిటూ పరిగెత్తమంటే మాత్రం పరిగెత్తలేను. వెనక ఎప్పుడో చాలా రోజుల క్రితం ఒక చిన్న నీతికథ లాంటిది చదివాను. దాని సారాంశం 'ఏడుపుగొట్టు మొహానికి హేతువక్కరలేదు. ఒకింట్లో ఓ పుట్టుగుడ్డి వున్నాడు. పొద్దున లేచినది మొదలు సాయంకాలం వరకూ, వాడు మూలుగుతూనే వుంటాడు. తనను గుడ్డివాణ్ణి చేసి, ఎవరూ తనని సరిగా చూడడం లేదనీ, నిర్లక్ష్యం చేస్తున్నారనీ వాడు రోజుతూ వుండేవాడు. ప్రతిరోజూ తిండిదగ్గర తిరణాల చేసేవాడు. నాకళ్ళు కనపడవుగా, మీరేం చేసుకుని ఏంతెంత తింటున్నారో, నాకుమాత్రం ఓ కబళం మొహాన కొడుతున్నారు—అని గోల. ఇంట్లోవాళ్ళు విసిగి వేసారిపోయి, ఓ రోజు ఓ గొర్రెను మొత్తం వండి, వార్చి, వాడిముందు వడ్డించారు. చేతితో తన వడ్డన పదార్థమంతా తడిమి చూసుకుని, ఒక్క నిముషం పొంగిపోయాడు. గుడ్డి కళ్ళుకూడా వెలగబోయినయ్. కాని ఏం లాభం, ఇంతలోనే ఒక్క నిముషం దీర్ఘంగా ఆలోచించినట్లు నిట్టూర్చి వాడన్నాడట—బాగుంది, బాగుంది. ఇవాళ ఏమన్నా పండగా పబ్బమో. నా వంతే యింత వచ్చిందే — మీరంతా ఏంతెంత వడ్డించుకున్నారో—నేనేం పాపం చేశానో, నేను గుడ్డివాణ్ణి—అని మళ్ళీ మామూలు పాట పాడుతూ బుడిబుడి దుఃఖం మొదలు పెట్టాడు. ఇంట్లోవాళ్ళు ఏమనుకున్నారో ఏమైపోయారో మనకక్కర్లేదు.

ఆ కథలోని గుడ్డివాడిలాంటివాణ్ణేమీ కాను నేను. మీరు పొరపాటున అట్లా అనుకుంటారేమో, నాకు జీవితం పట్ల గొప్ప ఆదరముంది. వాంఛ ఉన్నది. మరీ ఇరుకైన మనస్సేమీ కాదు. అసూయ ఏమాత్రం లేదనను కానీ, దానివలన ఎవరికీ అపకారం లేదు. నాకు వుండవచ్చును. అది వేరుమాట.

అందమైన వేసవికాలపు సాయంకాలాలు బాగా జన సమ్మర్దం గల నగరపు వడి వీధుల కూడలి వద్ద నిలుచుంటే నాకు అసంతృప్తి కలుగుతుంది. మరేం లేదు. వీపుమీద రొమ్ములను వొత్తుతూ, పయట జుంయ్‌మని జెండా కొసలా ఎగురుతూ వుంటే, రకరకాల కేశాలంకరణలతో స్కూటర్లపైన పోయే జంటలను చూసీ, అంతులేని జనసందోహాన్ని చూసి, ఏమిటో కొంప ముంచుకొని పోయేట్లు వాళ్ళు ప్రదర్శించే వేగాన్ని చూసి, వాళ్ళ చైతన్యాన్ని చూసీ, ఉత్సాహోద్రేకాలను తలచుకొనీ, నాకేమిటో

వింతగా వుంటుంది. నన్ను నేను నిశితంగా పరీక్షించుకుంటాను అసూయా, అని కాదు. మరి ఏమిటో తెలీదు. అట్లానే శీతకాలపు మనోహరమైన ఉదయవేళల వీధిలో నిల్చుంటే కూరలమ్మేవాళ్లవద్దనుంచీ, ముగ్గులు పెట్టుకుని పరవశించిపోయే కన్నెపిల్లలవరకూ, నా దృష్టిని ఆకర్షించటమేకాక, జీవితంలో వీళ్లకింత ఉత్సాహం, ఆశా, ఉద్రేకాలూ, అల్పసంతృప్తులూ ఏవిధంగా కలుగుతున్నాయన్న ప్రశ్న నా మనస్సులో మెదలటానికీ, అలా నాకు జీవితంలో చిక్కని మమతాబంధం ఏర్పడకపోవటానికి కారణాలను వెదుకుతూ, అసంతృప్తితో ఆలోచిస్తూ వుంటాను.

అప్పుడు బద్ధకంగా నిద్రలేచి నాకు సహజమైన ఆలోచనలలో పడిపోయాను. అసలన్నిరకాల అర్థం పర్థంలేని ఆలోచనలు, నా మనస్సు నిండా నిండటానికి కారణం ఈశ్వరి. నిన్నసాయంకాలం హఠాత్తుగా ఏమాత్రం అనుకోకుండా ఆమెను సింపోజియంలో చూశాను. అప్పుడే నా కాళ్లకు వణుకు, కళ్లకు మసక ప్రారంభమైనాయి. ఆవిడ చిరునవ్వు నన్ను చీల్చివేస్తుంది. ఆమె అంటేనే నాకు భయం. ఎందుకొచ్చిందో మరి. ఏమిటి సంబంధమో ఆమెనుగూర్చి తలచుకుంటూ వుంటే ఆమె ఒక అగ్ని పుష్పం అనిపిస్తూ వుంటుంది నాకు.

నగరంలో మేథమేటికల్ కాన్ఫరెన్సులో పాల్గొనటానికి నేను వచ్చాను. శ్రీమతి గిరిజాప్రియవిభూతి స్మారక పాఠశాలలో మాకు బస ఏర్పాటుచేశారు. అన్నివైపులకు పోవటానికీ, పెద్ద పెద్ద హోటళ్లకూ, ప్రధానమైన రథ్యలకూ, దాపుగా వున్న పెద్దస్కూలు ఇది. ఇప్పుడు వేసవికాలపు శెలవులు కావటం మూలాన మాకు బస ఏర్పాట్లు చేయటానికి వీలైంది.

నగరంలోని మధ్యతరగతి కుటుంబాల విత్తావసరాలు, గృహవసతి అన్న విషయంపై నేను పేపర్ ప్రెజెంట్ చేయటమూ, కడమ మూడురోజులూ ఇట్లానే వివిధ విషయాలపై, సమర్థులైనవాళ్లు చదివిన విషయాలపై చర్చా గోష్ఠుల్లో పాల్గొనటమూ, ఇక్కడ నా పని.

ఈశ్వరి నేను యూనివర్శిటీలో మేథమేటికల్ ఎకనమిక్స్ ఎమ్. ఏ చదువుతూ వుండగా, నా క్లాస్‌మేట్‌గా వుండేది. అయితే ఆమె సబ్జక్టు ప్యూర్ మేథమాటిక్స్. స్టాటిస్టిక్స్ క్లాసుల్లోనూ, ఇంకా కొన్నిక్లాసుల్లోనూ మేము కలుస్తూ వుండేవాళ్లం. గత నాలుగేళ్లుగా మేమీ మధ్య కలుసుకోలేదు. ఈశ్వరి గురించి ఏం చెప్పాలి—గొప్పఆకర్షణగల నిండైన విగ్రహం, కళకళలాడే, తళతళలాడే పళ్లూ, కళ్లూ. ఆమె కెవరైనా లెక్కలేదు. రాకెట్‌లాటి తత్వం.

చదువుకునే రోజుల్లో ఆమె అందరినీ హడలుకొడుతూ వుండేది. చదువైతే రాదని నాకు బాగా తెలుసు. అందుకే ఆమె థర్డ్‌క్లాసులో బయటపడటమే గొప్ప గగనమైపోయింది. చదువుకునే రోజుల్లో నేను ఫలాని సబ్జక్టుపై రిసెర్చి చేస్తాననీ, అదయిపోతా, ఇదయిపోతానని, గొప్పగా కోతలూ అవీ కోసేది. అయితే ఒకవిషయం చెప్పాలి. అరుదైన యోగం అది. అద్భుతమైన కంఠస్వరం ఈశ్వరిది. వినేవాళ్లు తన్మయులైపోయేట్లు పాటలు పాడేది. యూనివర్శిటీలో ఏ సంబంధమైన సమావేశాలూ, సభలూ, ఉత్సవాలూ జరిగినా, ఈశ్వరిపాటలు ఒక 'హైలైట్'. అందుకే ఈశ్వరి అంటే అందరూ పడి చచ్చేవాళ్లు.

ఆమె చాలా డబ్బుగడించిన, ఇంకా గడిస్తున్న డాక్టరుగారి పెద్దమ్మాయి. ఆ డాక్టరుగారు ముందు మిలటరీలో పనిచేసి,...తరువాత మళ్లా ఊరా ప్రాంతాలకు వచ్చి లక్షలు లక్షలు సంపాదించాడని చెప్పుకుంటారు.

నన్ను పసిపిల్లాడిలాగా ట్రీట్ చేయటం, నాకు చాలా కసినీ, ఉడుకుబోతుతనాన్నీ ఆమెపట్ల కలిగించక పోలేదు. ఎప్పుడైనా నన్ను మెచ్చుకునే కళ్లతో చూసి, పసిపిల్లాడి చెక్కిలిపైన మృదువుగా కొట్టే ధోరణిని మాటల్లో కనపరచేది. నేను యూనివర్శిటీ ఫస్టు సంపాదించినప్పుడైనా, ప్రాజ్ఞత్వాన్నీ, పురుషత్వాన్నీ ఊరామె గుర్తిస్తుందో లేదో నన్న ఉద్రేకం కలిగేది నాకు. నాకు ఈశ్వరి అంటే వల్లమాలిన ఆకర్షణ వుండేది. దాన్నిల ప్రేమంటే నాకు అభ్యంతరం లేదు. కాని 'ఈశ్వరి కెట్లా చెప్పగలనా మాట—అని మూడు సంవత్సరాలు రోజూ ఆలోచించాను. ఆటు తరువాత గవర్నమెంటు సర్వీసులో చేరిపోయి ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టాను. ఆ చదువుకునే రోజుల్లోనే ఈశ్వరిని గూర్చి చిత్ర విచిత్రమైన కథలు ప్రచారంలో వుండేవి. ఎవరిష్టంవచ్చినట్లు వాళ్లు చెప్పుకునేవారు. ఇటువంటి కట్టుకథల్లో అసూయా, మాత్సర్యం ఎక్కువ భాగాలని నాకూ తెలుసు. కాని, ఈశ్వరి గూర్చి వచ్చిన వాదులన్నీ ఆ కోవలోనివే కావు.

ఈశ్వరికీ, రామచంద్రరావుకీ సంబంధం వుంటుందని నాకు నమ్మకం. కాని నా బాచ్‌లో ఎవ్వరూ నేను ప్రేమించినంతగా ఈశ్వరిని ప్రేమించి వుండరని నా విశ్వాసం. ఆ రకరకాల కట్టుకథలను, గడ్డునిజాలను, రంపపుకోతలాగా భరించే వాణ్ణి.

ఆటుతరువాత ప్రధానమైన క్లబ్బుల సహాయార్థం ఆమె పాడటాలూ, రేడియోల్లో పాడటం, పత్రికల్లో ఫొటోలు, గమనిస్తూ వచ్చాను. తరువాత నాకు పెండ్లి అయింది. ఒకరోజున హఠాత్తుగా, మెరుపు మెరసినంతకాలం, నేనూ నా ఆవిడా, సిటీబస్ పట్టుకునే సన్నాహంలో వుండగా, ఈశ్వరి చూపింది. నా మనస్సెందుకో కలుక్కుమన్నా, ఆవిడ పలకరించటం, నేను నవ్వాల్సొడనలసి రావటం, తప్పిపోయింది కదా, అని సంతోషించాను. ఆటుతరువాత ఎప్పుడో ఒకసారి నా స్నేహితుడి బలవంతంమీద కమ్యూనిటీ హాలులో 'మల్లిక పెళ్ళి' అన్న గేయరూపక ప్రదర్శనకు వెళ్లాను. ఈ స్నేహితుడికా రచయితగారు ప్రాణస్నేహితుడట. కాంప్లిమెంటరీ టిక్కెట్లు చాలా మిగిలిపోయాయి. హాలంతా మరీ బోసిగా వుండటం బావుండదనో ఏమో, పనిగట్టుకొని, టాక్సీతెచ్చి ఇంటిముందుంచి, నానా బలవంతంచేసి ఈడ్చుకొని వచ్చాడు. రంగులైట్ల గాబరా, మధురమైన గాత్రం. ఏదో ఫరవాలేనా నాటకప్రదర్శన. నేపథ్యగాయని ఎవరో నాకు తెలుసు. ప్రదర్శన అయిపోయిన తరువాతకూడా మా శ్రీపతిగారు నన్ను విడిచిపెట్టలేదు. రచయితకు పరిచయం చేస్తానంటూ బరబరా లాక్కుపోయారు. ఆ రచయితగారిముందు నిలబడి,

# అగ్నిపుష్పం

తొట్టు చివరి గులాబిపూవులా వూగిపోతూ, తన అందమైన పలువరసలైన మల్లెపూలు పోయిస్తున్నది ఈశ్వరి. మా శ్రీపతి నన్ను ఈశ్వరికికూడా పరిచయం చేశారు. నా కళ్ళు సోలిపోతున్నాయి. ఒళ్ళు తూలిపోతున్నాది.

నావైపు అలవోకగానూ, నిరాదరంగానూ చూసి 'అయితే మాకెవరికీ తెలీకుండానే పెళ్లి చేసుకున్నారన్నమాట. భలేవారండీ. పిలిస్తే మేమంతా వస్తామని భయంకాబోలు' అన్నది. రచయితా, నా మిత్రుడూ తెల్లబోయారు. 'మరింకేమిటండీ, అంత బెట్టు చేశారు పాటకానికి రావటానికి. ఈశ్వరి గారు మీకు బాగా తెలుసునన్నమాట. ఆమె పాట వినేందుకైనా రావచ్చునే' అని శ్రీపతి ఆమెను పొగిడాడు.

'బావుందండోయ్. నేనిక్కడ కనపడతానని, పాడతానని తెలిస్తే బ్రహ్మరుద్రులు దిగివచ్చినా, ఆయన వచ్చేవారు కాదు' అని ముదలకించింది; ఈశ్వరి.

నేను నీళ్ళు నమిలాను. నా పెళ్లి అవ్యవధానంగా, జరిగిందనీ, శుభలేఖలు పంపే అవకాశమూ లేకపోయిందనీ, సంజాయిషీగా, చిన్నపిల్లాడిలాగా, ఏవిటో చెప్పాను. నిజంగా వ్యవధి వున్నా వొక్కనాటికీ ఈశ్వరికి నేను పంపను. అంతేగాక, ఈశ్వరి పెళ్లి మా ఇంటిముందే జరిగినా నేను వెళ్లను.

'అందరూ పాడేపాటే అది. ఇవాళ చూశాను రేపు నిశ్చయమైంది. ఎల్లుండి పెళ్ళాడాను అటు తరువాత మా పెద్దాడు. ఆపైన మాపాప. పిల్లలెందరేమిటో?' అని నవ్వింది.

ఈ ఈశ్వరి పాడైతే! నాకేడుపు వచ్చింది.

ఇంకా, అది ఏదో చెప్పబోతుంటే, 'వచ్చేనెలలో ఆ శుభవార్త తెలుస్తుంది. మనమంతా పార్టీకై ఇప్పుడ్నుంచే రెడీగా వుందాము' అన్నారు శ్రీపతి.


'గుడ్ న్యూస్' ఇంకా తల ఎత్తరేమండీ మీరు. ఎప్పుడూ తలఎత్తని పీరులేనా మీరు' అని కిలకిల నవ్వింది ఈశ్వరి. ఆ తరువాత మళ్లీ మేం కలుసుకోలేదు.

నిన్న సాయంకాలం మళ్లీ చూశాను. స్లీవ్స్ వున్నాయా లేవా అనిపించే పొట్టి జాకెట్‌లో వీపు చాలాభాగం కనిపిస్తూ వుంది. కొప్పు అందంగా చుట్టి అర్ధచంద్రాకారంగా పూలు తురిమింది. తుర్రున తూనీగలాగా, అటూ ఇటూ హడావిడిగా కలయతిరుగుతున్నది. ఆమెను చూడగానే నా కాళ్లలో వొణుకూ, నా గుండెలు వేగంగా కొట్టుకోవటం, నాలికమీద తడి ఆరిపోవటం, నీరసం లాంటిది రావటం. నేను పేపర్ చాలా బాగా రాశాననీ, విన్నవాళ్లందరూ మెచ్చుకుంటారనీ, నిర్భయంగా నిస్సంకోచంగా ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెపుదామనీ వచ్చిన నేను నీరుకారిపోయాను. మొట్టమొదటే నేను చదవాలి. ఆపేపరు కాపీ వుందని అక్కడనుంచి రూమ్‌కు వచ్చేశాను. దారిలో నన్ను అటకాయించి ఈశ్వరి కాఫీ, కిళ్లీ, అవీ ఇప్పించింది, అతిథులందరికీ, అవి అందించే ఏర్పాటు ఆమెదేమో మరి. 'నా పేపర్ ఎలాగుంది?' అన్నాను నేను ధైర్యం తెచ్చుకుని. దానికి సమాధానం చెప్పదు. అక్కడ వుమెన్స్ కాలేజీలో ఆమెకు లెక్చరర్ ఉద్యోగం ఇచ్చారుట. అందుకే తానూ కాన్ఫరెన్స్‌కి వచ్చిందట. ఈ 'మెస్సింగ్' వ్యవహారాలు చూసుకోవటంతో సతమతమైపోతూ వున్నదట. మళ్లీ రూముకు వచ్చి, కొన్ని సంగతులు మాట్లాడతాను, అన్నది. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అక్కడనుండి వచ్చి రూములో పడ్డాను.

వాస్తవ విషయాలన్నీ వదిలేసి, నా ఆలోచనలు ఊహల నాశ్రయించుకొని విహరిస్తాయి 'ఈశ్వరి'ని చూచినప్పుడూ, తలచినప్పుడూ. ఈశ్వరిని నేను పెళ్లి చేసుకున్నాను. ఆమె సుకుమారంగా నా తల లోకి వేళ్లు జొనిపి, భావగర్భితంగా పాటలు పాడుతూవుంటే ఆమె వొళ్లో తల ఆన్చి ఆమె ముఖంలోకి తదేకంగా చూస్తూ వుంటాను. నేను కాలేజీకి వెళ్లేముందు సుకుమారమైన ఆ చేతులను చెంపకాన్చుకుని ముద్దు పెట్టుకుంటాను. ఆమె నా తలవంచి పెదాలమీద లేత ముద్దు పెడుతుంది. కాని యీ ఆలోచనలు నాకు సంతోషంకన్నా గాఢమైన దుఃఖాన్ని, భరించలేని అసంతృప్తినే కలగజేస్తాయి. ఆలోచనల కేదోవిధంగా అంతరాయం కలుగుతుంది. మళ్లీ వాస్తవిక ప్రపంచంలోకి వచ్చేస్తాను.

మధ్యాహ్నం భోజనాలదగ్గర ఈశ్వరి కన్పించలేదు. నాకు చాలా విసుగూ, అసహ్యమూ కలిగింది; ఆమె ఉత్సాహోద్రేకాలు తలచుకొని. ప్రపంచంలో ఎంత అన్యాయమైనా, జరగటానికి అవకాశముంది. అసలు అన్యాయమే చేయనివాడెవరూ వుండనే వుండరు. ఈశ్వరికి ఉద్యోగం రావటమేమిటి.

ఆమె అసలు సరిగ్గా చదువుకోనే లేదు. అథవా డిగ్రీ అయినా, పోనీ మంచిది సంపాదించిందా అంటే థర్డ్‌క్లాస్. ఆమెకెట్లా ఉద్యోగం వచ్చింది. సంఘంలో



జరుగుతున్న కూపోజాటూ, కుతంత్రాలూ, దుర్మార్గం తలచుకుంటే, చేతగాని తనంతో తల బద్దలు కొట్టుకోవాలని పిస్తుంది. ఆ ఉద్యోగం ఈశ్వరికి ఎలా వచ్చిందో, ఎందరిముందు వెకిలినవ్వులు నవ్విందో, ఎవరు యీామెను చూసి మతి పోగొట్టుకున్నారో—అన్న తలపు వస్తే నాకు వొంటికి కారం రాచినట్లవుతుంది.

సాయంకాలం మళ్లీ ఆవేపు వెళ్లలేదు నేను, సీతాకోకచిలుకలాగా ఈశ్వరి సింగారించుకుని అటూ ఇటూ తిరుగుతూవుంటే చూడలేక. వీళ్లందరి కంట పడకుండా, పోయి 'టీ' తాగిరావాలని వుంది. కాని ఎవరైనా చూస్తే బావుండదు. అడగనూ అడగవచ్చును. అందుకని బద్ధకంగా పడుకుని వుండిపోయాను. ఐదుగంటలకు 'సెషన్' అయిపోతుంది, ఆతరువాత వో అరగంట ఆగి వెళ్లవచ్చును. అనుకుంటూ వుండగా, నా గదితలుపు కొట్టారెవరో, బహుశా 'బాయ్' టీ తెచ్చాడేమోనని సంతోషంతో నేను తలుపు తెరచాను. 'టీ' తెచ్చినమాట నిజమేకాని, 'బాయ్' వెనకాలే ఈశ్వరి కూడా నిలబడివుండటం నాకు తొట్రుపాటు కలిగింది. నాలోని సంచలనాన్ని చిక్కబట్టుకుంటూ ఆమెను లోనికాహ్వానించాను. ఏ మాత్రమూ, కొత్తా, బెరుకూ లేకుండా, ఆమె వెళ్లి నా 'కాట్' మీద కూచుంది. నేను కొంచెం దూరంగా కుర్చీ లాక్కుని కూచుండిపోయాను. 'బాయ్' ఇద్దరికీ 'టీ' ఇచ్చాడు. తరువాత వెళ్లిపోయాడు.

'ఈపూట మీరెందుకావేపుకు రాలేదు?

నేను కొంచెం ధైర్యం తెచ్చుకున్నాను

'అక్కడ మీరు కనపడతారేమోనని'

ఈశ్వరి అందంగా నవ్వింది. 'నన్ను నువ్వంటనే నా ప్రాణానికి హాయిగా వుంటుంది.'

'అలా అనలేను నేను.'

ఈశ్వరి కొంచెం విచారంగా చూసింది.

'క్రితంసారి మనం 'మల్లికపెళ్లి' నాటకంలో కలుసుకున్నాం. అబ్బాయా? అమ్మాయా మీకు.'

'అబ్బాయి' -

'నేనమ్మాయియి వుంటుందనుకున్నాను, సరే మీరే గొప్ప. పిహెచ్‌డి. చేయలేదా?,

'ఇప్పుడవకాశం వుందని తెలిసింది. చేస్తున్నాను.'



'ఏందుకు మీరెప్పుడూ ఏదో ఆలో చనలతో, దేన్నో వెతుక్కుంటున్నట్లు వుంటారు'....

'..................'

'ఉత్సాహంగా వుండరు.'

వాక్యాంచెం చమత్కారంగా మాట్లా డాలనిపించింది. అదీ కాక ఈశ్వరితో ఇంత చనువుగా, ఇంత దగ్గరగా, మళ్ళా మాట్లాడే అవకాశం వుంటుందో, వుండదో నాకు. నా మనస్సు ఆర్ద్రమై పోయింది. ప్రయోజనం వున్నా లేకపోయినా, నాకు ఈశ్వరిపట్ల ఎంత అనురాగ మున్నదో ఆమెకు చెప్పాలి. లేకపోతే ఆమె తెలుసుకునే అవకాశం వుండదు.

ఇట్లా ఉపోద్ఘాతం మొదలెట్టాను.

'లోకంలో ప్రతివ్యక్తి కూడా ఏక తల్లికడుపున పుట్టవలసి వుండటం, ఎంత యథార్థమో, ఎంత అగత్యమో, అట్లానే మున్ఫయ్యేళ్ళ వయస్సున్న యువ కుడికి ఒక ప్రేమకథ అంటూ వుండటం కూడా తప్పదు. అలాంటిదేదో అని ఎందు కనుకోరాదు ?'

ఈశ్వరి ఉలిక్కిపడి చూసింది. తాను నమ్మలేనుగాక నమ్మలేను అన్నట్లు వింతగా మొహం పెట్టింది. నేను చెప్ప దలచుకున్నదేదో నాపుగా మనసే గట్టి నిర్ణ యానికే వచ్చాను మళ్ళీ నాకీ అవకాశ మైనా కలుగుతుందో కాదో

'ఇంకా ఏం ప్రేమకథ మీకు పెళ్ళయింది. బాబుకూడా పుట్టాడు. అందుకని నీరసంగా వుంటారా?' అని బూసడింపుగా నవ్వింది.

'నవ్వవొద్దు.'

'నవ్వనులెండి పోనీ జాలిపడుతున్నాను. చెప్పండి.' అని బుంగమూతి పెట్టింది.

'నేను చిన్నప్పటినుండీ చాలా భయ స్తుణ్ణి. అందుకని చాలా చైతన్యం వుండి, ఉత్సాహోద్రేకాలుకల అమ్మాయి భాగ్యస్వామిగా వుండాలని కోరుకుంటూ వుండేవాణ్ణి. కాని ఆ అమ్మాయిని చేసుకో లేక పోయాను'

'నాకు నమ్మకంలేదు, కనీసం ఆ అమ్మాయికి యీ విషయం తెలిస్తైనా వుండదు. మీరా అమ్మాయితో మాట్లా డైనా వుండరు'

'నన్ను క్షమించండి. నేను చేసుకోవా

# అగ్ని వర్షం


లను కున్నది మీ...నిన్నే' ఈశ్వరి రెప్ప లల్లార్చి విచిత్రంగా చూసింది. అలవోకగా నవ్వేసింది.

'ఒకవేళ నేను మీతో, ధైర్యం చేసి, సమయం చూసీ, బలమంతా కూడగట్టుకుని చెప్పినా, ఇట్లానే నవ్వేసివుండే దానివవే, నే చెప్పు డూ నీముందీమాట తేలేక పోయాను.'

ఈశ్వరిగొంతులో ఏదో విచిత్రమైన మార్పు వచ్చింది.

చూపులను పక్కకు తిప్పుకుని 'ఒక్కటి మాత్రం నిజం చెప్పండి. 'ఇక నేను మిమ్మల్నియేమీ అడగను.'

'అంటే యీ చెప్పింది నిజం కాదనా! నేనాశించినట్లే నా జీవితంలో జరిగివుంటే ఎంత బావుండేదో! నేను నిజం చెపు తున్నాను ఈశ్వరీ. త్రికరణశుద్ధిగా చెపు తున్నాను. నీకు తెలీదు. నిన్ను రోజూ వోసారి చూడటమే నాకు జీవిత సాఫల్యంగా వుండేది ఆరోజుల్లో. ఓ సారెందుకో ఫైనలియర్‌లో నువ్వు వారంరోజులు కాలేజీకి రాలేదు. మీ ఇంటిముందు కిల్లీబడ్డీ పక్కనే నిలుచుని ఆ వారం రోజులూ మూడు గంటలసేపు తచ్చట్లాడేవాణ్ణి. నీగురించి అసహ్యమైన విషయాలు, నీళ్ళా, వాళ్ళా మాట్లా డుతూ వుంటే, తల పగులగొట్టుకునో,




గుర్కాడు విషం తీసుకునో చచ్చిపోవాలని పించేది. రెండేళ్ళలో మేథమేటిక్స్ కంటే నిన్నే ఎక్కువ ఆరాధించాను నేను, కాని నేను పిరికివాణ్ణి. ఒకవేళ చేసుకునివుంటే ఎట్లావుండేదో కాని, అప్పటి నీచైత న్యోత్సాహాలకు, సాయికి నేను సమీపించలే నన్న భయంతో, వాయిపిడిచి, పోనీ, ఏమయితే అదే అవుతుందన్న నిబ్బరంతో నైనా చెప్పలేకపోయాను. నిజం చెపు తున్నాను ఈశ్వరీ! జీవితంలో ఎక్కడ ఏది చూసి, నాకు ఆనందం కలిగినా, అపూయ కలిగినా, ఆర్ద్రతకలిగినా, నీవే గుర్తు వస్తావు. ఇప్పుడీ మాటలుచెప్పి ఏమీ ప్రయోజనంలేదు'

ఈశ్వరికళ్ళు తడికాగలవని నా ఊహ కైనా అందని విషయమే.

మేము ఇట్లానే అడ్డదిడ్డంగా మాట్లాడుకున్నాము.

చీకటి ఎప్పుడుపడిందో తెలీదు.

వెళుతూ వెళుతూ నాచేతిని ప్రేమగా తనచేతిలోకి తీసుకుని, సున్నితంగా నొక్కింది ఈశ్వరి.

'ఈసారి మా ఊరొచ్చి మా శ్రీమతినీ బాబునూ చూస్తాను'.

'తప్పకుండా' అన్నాను పొడిగా వున్నాయా మాటలు.

వెనక్కుతిరిగి చూసింది వెళుతూ.

ఆకళ్ళు పుజ్జ్వలంగా వున్నాయి.

మళ్ళీ వెనక్కు తిరిగి వచ్చింది ఏదో మరిచిపోయిన దానిలా.

ఒక్కనిముషం మౌనంగా నిల్చుంది.

మళ్ళీ వెళుతూ; రేపు ఊరెళ్ళి పోయే ముందు మా ఇంటికోసారి రాకూడదా, అన్నది. నేను మాట్లాడలేదు. ఈశ్వరి వెళ్ళి పోయింది.

ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు.

ఈశ్వరిని తలచుకొని ఎందుకో చాలా చాలా జాలి కల్గింది.

విచిత్రమే కాకుండా అవహాస్యమైన సంగతి.

'నాగురించి ఎవరు జాలిపడేట్లు?' ●